# వరుణ్‌తేజ్ హారర్ కామెడీ



వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఓ ఇండో కొరియన్ హారర్ కామెడీ మూవీ రానున్నది. 'వీటీ 15'(వర్కింగ్ టైటిల్)తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. ఇప్పటికే రెండు షెడ్యూల్స్‌ని విజయవంతంగా ఈ సినిమా పూర్తి చేసుకున్నది. హైదరాబాద్, అనంతపూర్ పరిసరాల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరించామని, ఫస్ట్‌హాఫ్‌లోని థ్రిల్లింగ్ సీన్స్, హ్యూమర్ సీన్స్ ఈ షెడ్యూల్‌లోనే పూర్తి చేశామని, రీతికా నాయక్, సత్య, మిర్చి కిరణ్ ఈ సినిమాలో కామెడీ మెరుపులు మెరిపించారని మేకర్స్ తెలిపారు. వరుణ్‌తేజ్, రీతికా నాయక్‌లపై పల్లెటూరు నేపథ్యంలో చిత్రీకరించిన అనంతపూర్ షెడ్యూల్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. త్వరలోనే కొరియాలో ఈ సినిమా మూడో షెడ్యూల్ మొదలు కానుంది. కథలోని కీలక పార్ట్‌ని ఈ షెడ్యూల్‌లోనే పూర్తి చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.థమన్.

# కొత్తదనానికే ప్రాధాన్యమిస్తున్నా!

ప్రస్తుతం నాలుగు భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు యువ హీరో బెల్లంకొండ శ్రీనివాస్. వాణిజ్య పంథాలోనే వైవిధ్యమైన కథాంశాల్ని ఎంచుకుంటున్నానని, ప్రతీ సినిమాలో నటుడిగా కొత్తదనాన్ని చూపించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు బెల్లంకొండ శ్రీనివాస్. ఆయన మంచు మనోజ్, నారా రోహిత్‌తో కలిసి నటించిన తాజా చిత్రం 'భైరవం' ఈ నెల 30న విడుదల కానుంది. విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కె.కె.రాధామోహన్ నిర్మించారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో హీరో బెల్లంకొండ శ్రీనివాస్ విలేకరులతో పంచుకున్న విశేషాలు..



- ఈ సినిమాలో హీరో కాలభైరవున్ని కొలుస్తాడు. అందుకే 'భైరవం' అనే టైటిల్ పెట్టాం. ముగ్గురు మిత్రుల నడుమ ఓ గుడి చుట్టూ ఈ కథ నడుస్తుంది. యాక్షన్, ఎమోషన్స్, డివైన్ ఎలిమెంట్స్‌తో ఆద్యంతం ఉత్కంఠను పంచుతుంది.
- నా గత చిత్రాల ద్వారా నాకు కమర్షియల్ హీరో అనే పేరొచ్చింది. అయితే మాస్‌కు బాగా కనెక్ట్ కావాలనే ఆలోచన ఎప్పటి నుంచో ఉంది. అందుకే ఓ రూరల్ స్టోరీ కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఈ కథ దొరికింది. తమిళ 'గరుడన్'కు మన నేటివిటీకి అనుగుణంగా మార్పులు చేసి దర్శకుడు విజయ్ కనకమేడల అద్భుతంగా ఈ చిత్రాన్ని రూపొందించారు.
- ఈ సినిమాకు కాస్టింగ్ బాగా కుదిరింది. నేను, మనోజ్, రోహిత్..ముగ్గురం సినిమాలకు కొంత కాలంగా బ్రేక్‌నిచ్చాం. దాంతో మా కాంబో ప్రేక్షకులకు ఫ్రెష్‌గా అనిపిస్తుంది. ఈ కథకు మనోజ్, రోహిత్ పర్‌ఫెక్ట్‌గా కుదిరారు. కథానాయిక అతిథి శంకర్ ఎనర్జిటిక్ రోల్‌లో కనిపిస్తుంది.
- నేను కమర్షియల్ పంథాలోనే కొత్త కథల్ని అన్వేషిస్తున్నా. ప్రతి సినిమాను లాంచింగ్ మూవీలా ఫీలవుతూ కమిట్‌మెంట్‌తో పనిచేస్తున్నా. కమర్షియల్ ఫార్మాట్‌లోనే ప్రయోగాలు చేయాలన్నది నటుడిగా నా లక్ష్యం. ఇప్పుడు నా వయసు 31. ఇంకా కెరీర్ చాలా ఉంది. విభిన్న కథల్లో నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవాలనుకుంటున్నా.
- ప్రస్తుతం 'హైందవ' 'టైసన్ నాయుడు' 'కిష్కింధపురి' చిత్రాల్ని చేస్తున్నా. ఇవి వేటికవే ప్రత్యేకం. 'కిష్కింధపురి' అనే ఊహాత్మక ప్రపంచంలో నేపథ్యంలో నడుస్తుంది. ఇక 'హైందవ' భారీ గ్రాఫిక్స్ కలబోసిన ఓ అద్భుతమైన కథ. రాబోవు నా చిత్రాలన్ని ప్రేక్షకులకు వినూత్నమైన థియేట్రికల్ అనుభూతినందిస్తాయి. 'భైరవం' చిత్రానికి తొలిరోజే పాజిటివ్ టాక్ లభిస్తుందనే నమ్మకంతో ఉన్నాం. అంత గొప్పగా రూపుదిద్దుకుంది చిత్రం.
- పూరి జగన్నాథ్‌తో నేను సినిమా చేయబోతున్నానని వార్తలొచ్చాయి. ఆయనతో సినిమా చేయాలనుంది. మేమిద్దరం కలిసి కొన్నిసార్లు చర్చించాం. తప్పకుండా మా ఇద్దరి కాంబోలో సినిమా ఉంటుంది.



# అట్లీ సినిమా టైటిల్ అదేనా?



'పుష్ప 2'తో ఇండియన్ బాక్సాఫీస్ ఉలిక్కిపడే మాస్ హిట్ అందుకున్న అల్లు అర్జున్.. దర్శకుడు అట్లీతో హై స్టాండర్డ్ టెక్నికల్ మూవీతో రాబోతున్నారు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ వీడియోనే భారీ హైప్ క్రియేట్ చేసింది. ఈ వీడియో చూశాక.. ఇది సూపర్‌హీరో కాన్సెప్ట్‌తో రానున్న సినిమా అని ఇట్టే అర్థమైపోతుంది. మార్వెల్, అవెంజర్స్ లాంటి హాలీవుడ్ కల్ట్ క్లాసిక్స్ తరహా కథతో ఈ సినిమా రాబోతున్నదని టాక్. అంతేకాదు, ఈ సినిమాలో హీరోగా, విలన్‌గా రెండు పాత్రల్లోనూ అల్లు అర్జునే కనిపిస్తారట. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో ఓ స్థాయిలో వైరల్ అవుతున్నది. కథ రీత్యా ఇందులో అయిదుగురు కథానాయికలకు ప్లేస్ ఉందట. ఇప్పటికే దీపికా పదుకోన్, మృణాళ్ ఠాకూర్, భాగ్యశ్రీ బోర్సే ఖరారైనట్టు తెలుస్తున్నది. మిగతా రెండు పాత్రలూ ఎవర్ని వరిస్తాయో చూడాలి. ఇదిలావుంటే ఈ సినిమాకు రెండు టైటిల్స్ ప్రస్తుతం ప్రచారంలో ఉన్నాయి. అందులో ఒకటి 'ఐకాన్' కాగా, రెండోది 'సూపర్‌హీరో'. గతంలో బన్నీ కోసమే దర్శకుడు వేణు శ్రీరామ్ 'ఐకాన్' టైటిల్ అనుకున్నారు. కానీ ఆ ప్రాజెక్ట్ సెట్ కాలేదు. అయితే.. అట్లీ సినిమాకు 'ఐకాన్' ఖరారయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుస్తున్నది. ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలు కానున్నదని సమాచారం.

# పూల గౌను సోయగాలు

## కేన్స్‌లో మెరిసిన అలియా

అగ్ర కథానాయిక అలియాభట్ కేన్స్ చిత్రోత్సవంలో సందడి చేసింది. ఎర్ర తివాచీపై నాజూకు అందాలతో హొయలొలికించింది. ఈ భామ వరుసగా రెండోసారి కేన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో భాగమైంది. రెడ్ కార్పెట్ ఎంట్రీకి ముందే తన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ షేర్ చేసింది అలియా. సాధారణ ఎంబ్రాయిడరీతో కూడిన పూల గౌను ధరించి వీక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. అక్కడక్కడా సన్నటి వజ్రాలు పొదిగిన ఈ గౌనులో అలియా దేవకన్యలా ఉందని ఆమె అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలను షేర్ చేసిన అలియా 'హలో కేన్స్' అంటూ రాసుకొచ్చింది. ఈ ఏడాది కేన్స్‌లో భారతీయ సినీరంగం నుంచి ఐశ్వర్యరాయ్, జాన్వీకపూర్, అలియా భట్, అతిథి రావు హైదరీ వంటి బాలీవుడ్ తారలు తళుక్కున మెరిశారు. కేన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్ శనివారంతో ముగియనుంది. ప్రస్తుతం అలియాభట్ 'లవ్ అండ్ వార్' 'అల్ఫా' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నది.

# థియేటర్ల బంద్ లేదు

జూన్ 1 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్ల బంద్ జరగబోవడం లేదని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రకటించింది. సింగిల్ థియేటర్‌లలో కూడా పర్సంటేజీ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో ఎగ్జిబిటర్లు జూన్ 1 నుంచి బంద్‌కు సన్నాహాలు చేస్తున్నారని వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత వారం రోజులుగా ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో నిర్మాతలు పలు దఫాలుగా సమావేశమయ్యారు. తాజాగా శనివారం నిర్వహించిన సమావేశంలో ఎలాంటి బంద్ ఉండబోదని ఛాంబర్ వెల్లడించింది. ఈ సందర్భంగా ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ మీడియాకు వివరాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ 'శనివారం జరిగిన సమావేశంలో ఇరు రాష్ట్రాల ప్రముఖ నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లందరూ పాల్గొన్నారు. బంద్ అంశాన్ని చాలా తప్పుగా ప్రచారం చేశారు. ఒకవేళ చర్చలు జరగకపోతే జూన్ 1వ తేదీ నుంచి బంద్‌కు ఆస్కారం ఉండేది కావొచ్చు. ప్రస్తుతానికి మాత్రం ఎలాంటి బంద్ లేదు. సింగిల్ థియేటర్ల పర్సంటేజీ అంశం ఇప్పుడు చర్చకు వచ్చింది. దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. మూడు సెక్టార్ల నుంచి ఓ కమిటీని ఏర్పాటు చేయబోతున్నాం. ఓ నిర్ణీత కాలపరిమితితో కమిటీ సమస్యకు పరిష్కారాలను సూచిస్తుంది. ఈ నెల 30న జరిగే సమావేశంలో కమిటీని నిర్ణయిస్తాం' అన్నారు. బంద్ గురించిన దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని, తెలుగు ఛాంబర్ మాత్రమే అధికారిక సమాచారాన్ని వెల్లడిస్తుందని, ఇండస్ట్రీలోని సమస్యలపై త్వరలో ప్రభుత్వంతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని దామోదర ప్రసాద్ పేర్కొన్నారు.



# అతని నమ్మకం నిజమైంది

'నా కెరీర్‌లో 'మళ్లీ రావా' తర్వాత అద్భుతమైన అనుభూతిని అందించిన కథ 'అనగనగా'. దర్శకుడు సన్నీ, రచయిత దీప్తి ఎంతో చక్కగా సినిమాను తీర్చిదిద్దారు. ఈ సినిమాను అడివి శేషుకు చూపించాను. తాను చాలా ఎమోషనల్ అయ్యాడు. సినిమాలో విషయం ఉందని మెచ్చుకున్నాడు. అతని నమ్మకాన్ని ప్రేక్షకులు కూడా బలపరిచారు. బేసిగ్గా సినిమాలన్నీ థియేటర్లలో విడుదలయ్యాక ఓటీటీకి వస్తాయి. కానీ ఈ సినిమాకు వస్తున్న స్పందన చూసి, కొన్ని థియేటర్లలో సినిమాను విడుదల చేస్తున్నాం. ఆడియన్స్ బిగ్ స్క్రీన్‌పై కూడా చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నా' అని హీరో సుమంత్ తెలిపారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన ఫీల్‌గుడ్ ఎంటర్టైనర్ 'అనగనగా'. కాజల్ చౌదరి కథానాయిక. సన్నీ సంజయ్ దర్శకుడు. రాకేశ్‌రెడ్డి గడ్డం, రుద్రా మదిరెడ్డి నిర్మాతలు. ఓటీటీలో విడదలైన ఈ సినిమా ప్రేక్షకుల ప్రశంసలందుకుంటన్నది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్‌లో సుమంత్ మాట్లాడారు. దర్శకుడు సన్నీ మాట్లాడతూ 'ఈ కథ మమ్మల్ని అమ్మలా జోలపాడింది. నాన్నలా ధైర్యాన్నిచ్చింది. గురువులా జ్ఞానాన్ని నేర్పింది. ఈ సినీ ప్రపంచానికి మా అందర్నీ పరిచయం చేసింది. ఇంతటి ప్రోత్సాహాన్నిచ్చిన ఈటీవీ విన్ వారికీ, మా హీరో సుమంత్‌గారికీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. వ్యాస్ పాత్రలో సుమంత్‌ని తప్ప మరొకర్ని ఊహించలేను. అంతబాగా చేశారాయన.' అని చెప్పారు. ఇంకా అతిథులుగా వచ్చిన అడివి శేష, ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి చిత్రబృందానికి అభినందనలు అంఇంచారు. చిత్ర నిర్మాత రాకేష్‌రెడ్డి కూడా మాట్లాడారు.

# అదుర్స్ విలన్ ముకుల్‌దేవ్ ఇకలేరు



బాలీవుడ్ నటుడు ముకుల్‌దేవ్(54) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా ఆనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ముంబయ్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని మీడియాకు తెలియజేశారు. సింహాద్రి, సీతయ్య, మాస్ చిత్రాల్లో విలన్‌గా నటించిన రాహుల్ దేవ్ సోదరుడే ఈ ముకుల్‌దేవ్. సీరియల్ నటుడిగా కెరీర్ మొదలుపెట్టిన ముకుల్‌దేవ్ బుల్లితెరపై మంచి నటుడిగా పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు. నటుడిగా ఆయన తొలి సినిమా 'దస్తక్'(1996). ఆ తర్వాత బాలీవుడ్‌తో పాటు తెలుగు, పంజాబీ, కన్నడ భాషాచిత్రాల్లోనూ నటించి బహుభాషానటుడిగా గుర్తింపు సాధించారు. తెలుగులో ముకుల్‌దేవ్ నటించిన తొలి సినిమా రవితేజ 'కృష్ణ'. ఎన్టీఆర్ 'అదుర్స్'తో టాలీవుడ్‌లోనూ మంచి పేరు సాధించారాయన. అలాగే బాలీవుడ్‌లో రామ్‌గోపాల్‌వర్మ నిర్మించిన 'అబ్ తక్ చప్పన్' చిత్రం ఆధారంగా తెలుగులో రూపొందిన 'సిద్ధం' సినిమాలో విలన్‌గా నటించారు ముకుల్‌దేవ్. సినిమా అంతగా ఆడకపోయినా అందులోని ముకుల్‌దేవ్ నటనను మాత్రం ఆడియన్స్ ప్రత్యేకంగా అభినందించారు. ఇంకా కేడీ, మనీ మనీ మోర్ మనీ, నిప్పు తదితర తెలుగు చిత్రాల్లో ముకుల్‌దేవ్ నటించారు. 'అంత్ ది ఎండ్' సినిమా నటుడిగా ఆయన చివరి చిత్రం. ముకుల్‌దేవ్ మరణవార్తతో బాలీవుడ్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. పలువురు బాలీవుడ్ ప్రముఖులు ఆయన మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ కూడా ముకుల్‌తో తన అనుభవాలను నెమరువేసుకుంటూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'ముకుల్ మరణం బాధాకరం. నిజంగా ఆయన నిబద్ధత గల నటుడు. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా' అని సంతాపం వెలిబుచ్చారు ఎన్టీఆర్.



# ఆ క్షణంలో ఏదో సాధించాననే ఫీలింగ్

తాను నటించిన ఒక్క తెలుగు సినిమా కూడా విడుదల కాకముందే.. ఇక్కడి స్టార్ హీరోయిన్లకు ఏమాత్రం తగ్గని క్రేజ్‌ని సాధించారు మలయాళ భామ మాళవిక మోహనన్. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఈ మలయాళ మందారం ఇటీవల తన ఎక్స్ వేదికగా అభిమానులతో ముచ్చటించారు. ఈ సందర్భంలో ప్రభాస్ గురించి అభిమానులు అడగ్గా.. 'ప్రభాస్‌తో పరిచయం కాకముందు పలు ఇంటర్వ్యూల్లో ఆయన్ను చూశా. ఆ మాట్లాడే తీరు చూసి.. తాను అంత రుముఖుడేమో, ఎవరితో ఎక్కువగా మాట్లాడడేమో అనుకున్నా. కానీ ఆయనతో కలిసి పనిచేయడం మొదలుపెట్టిన తర్వాత నా అభిప్రాయం తప్పని అర్థమైంది. నిజానికి ఆయనంత సరదాగా ఎవరూ ఉండరు. ఆయన ఉంటే సెట్ అంతా కోలాహలమే. డల్ మూమెంట్ అనేది ఆయన దరిదాపుల్లో ఉండదు.' అంటూ చెప్పుకొచ్చింది మాళవిక. 'నేను సాధించాను.. అని మీకు అనిపించిన క్షణమేది? అని ఓ అభిమాని అడగ్గా.. 'క్యూ లైన్లో వేచి ఉండకుండా డైరెక్ట్‌గా దేవాలయాల్లోకి అడుగుపెట్టిన క్షణంలో ఏదో సాధించాననే ఫీలింగ్.' అని సమాధానమిచ్చింది మాళవిక. 'ది రాజాసాబ్' తర్వాత మీరు చేయబోయే తెలుగు సినిమా ఏది? అన డగ్గా.. 'మీరే చెప్పండి?.. మీరు నన్ను ఏ హీరోకు జంటగా చూడాలనుకుంటున్నారు!? ' అంటూ ఎదురు ప్రశ్నించి అందంగా నవ్వేసింది మాళవిక మోహనన్.



# థ్రిల్లింగ్ అంశాలతో గ్యాంబ్లర్స్

మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో మంచి పేరు తెచ్చుకున్న సంగీత్ శోభన్ కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'గ్యాంబ్లర్స్'. ప్రశాంతి చారులింగా కథానాయిక. కేఎస్‌కే చైతన్య దర్శకుడు. సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మాతలు. ప్రసుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా జూన్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని శుక్రవారం మేకర్స్ విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ ' ఇదొక మిస్టరీ ఎంటర్‌టైనర్. సంగీత్ శోభన్ ఇందులో కొత్తగా కనిపిస్తారు. నటుడిగా ఆయనలోని మరోకోణాన్ని ఆవిష్కరించే సినిమా ఇది. ఇందులోని థ్రిల్లింగ్ అంశాలు, ట్విస్టులు ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తాయి.' దర్శకుడు చెప్పారు. కొత్త కాన్సెప్ట్‌తో, థ్రిల్లింగ్ అంశాలతో రూపొందిన ఈ సినిమా తప్పకంపడా అందర్నీ అలరిస్తుందని నిర్మాతలు చెప్పారు. రాకింగ్ రాకేష్, పృథ్వీరాజ్ బన్న, సాయిశ్వేత, జస్విక, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రేమ్ సాగర్, సంగీతం: శశాంక్ తిరుపతి.



# 3BHK స్వరప్రయాణం..

సిద్ధార్థ్ హీరోగా రూపొందుతోన్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ '3 BHK'. శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు కీలక పాత్రధారులు. శ్రీగణేశ్ దర్శకుడు. శాంతి టాకీస్ పతాకంపై బ్లాక్‌బస్టర్ 'మావీరన్' నిర్మాత అరుణ్‌విశ్వ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. జూలై 4న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్‌కి మంచి స్పందన వచ్చిందని మేకర్స్ చెబుతున్నారు. తాజాగా ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌ని స్టార్ట్ చేసి, తొలిపాటను మేకర్స్ విడుదల చేశారు. 'కలలన్నీ..' అంటూ సాగే ఈ పాటను రాకేందుమౌళి రాయగా, అమృత్ రామ్‌నాథ్ స్వరపరిచారు. హేమచంద్ర వేదాల, గోపికా పూర్ణిమ, సాహితీ చాగంటి, పివిఎన్ఎస్ రోహిత్ కలిసి ఈ పాటను ఆలపించారు. సిద్ధార్థ్, దేవయాని పాత్రలపై ఫ్యామిలీ ఎమోషన్స్ నేపథ్యంలో ఈ పాట సాగింది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే పూర్తి కమర్షియల్ సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. మీతా రఘునాథ్, చైత్ర తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మాటలు: రాకేందు మౌళి, కెమెరా: దినేష్‌కృష్ణన్.బి అండ్ జితిన్ స్టానిస్లాస్.

# మ్యూజికల్ లవ్‌స్టోరీ 'నిలవే'

సౌమిత్‌రావు, శ్రేయాసి జంటగా నటిస్తున్న చిత్రం 'నిలవే'. వీఓవీ ఆర్ట్స్ వ్యా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్నది. సౌమిత్ రావు, సాయి వెన్నం దర్శకులు. శుక్రవారం ఈ సినిమాలోని పాత్రల్ని పరిచయం చేశారు. సంతోషం, నమ్మకం, అలక, పిలుపు అంటూ వివిధ రకాల భావోద్వేగాలకు సంబంధించిన పోస్టర్‌లను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సౌమిత్ రావు మాట్లాడుతూ 'అంతా కొత్తవాళ్లతో సినిమా తీశాం. మ్యూజికల్ లవ్‌స్టోరీ ఇది. హృదయాన్ని కదిలించే ఎమోషన్స్ ఉంటాయి' అన్నారు. ఓ వ్యక్తి జీవిత ప్రయాణానికి అద్దం పడుతూ సాగే చిత్రమిదని, కథలో సంగీతానికి చాలా ప్రాధాన్యత ఉంటుందని దర్శకుల్లో ఒకరైన సాయి వెన్నం తెలిపారు. కథాగుణంగా అద్భుతమైన పాటలు కుదిరాయని సంగీత దర్శకుడు కల్యాణ్ నాయర్ పేర్కొన్నారు. హర్ష చెముడు, సుప్రియా ఐసోలా, రూపేష్ మారాపు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: సాయి వెన్నం, గిరిధర్ రావు పోలాడి.



# 'స్పిరిట్'లో నాయికగా



ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందనున్న 'స్పిరిట్' చిత్రంపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలేర్పడ్డాయి. జూలైలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఈ సినిమాలో కథానాయికగా ఎవరూ నటిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే పలువురు అగ్ర కథానాయికల పేర్లు తెరపైకి వచ్చాయి. ముఖ్యంగా దీపికా పడుకోన్ పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే ఆమె భారీ రెమ్యునరేషన్‌ను డిమాండ్ చేయడంతో పాటు షూటింగ్ పరంగా కొన్ని కండీషన్స్ పెట్టడంతో మేకర్స్ వద్దనుకున్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలో 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రిని కథానాయికగా ప్రకటించారు. ఈ విషయాన్ని తన ఎక్స్ ఖాతా ద్వారా పంచుకుంది త్రిప్తి దిమ్రి. ప్రస్తుతం ఈ అప్‌డేట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్' చిత్రంతో త్రిప్తి దిమ్రికి దేశవ్యాప్తంగా గుర్తింపు దక్కింది. తాజాగా 'స్పిరిట్'లో ఛాన్స్ దక్కించుకొని అందరిని ఆశ్చర్యపరచింది.